సాక్షి ములుగు

ఆదివారం । 23 । మార్చి । 2025



ఇక ఎత్తిపోసుడే..
దేవాదుల ప్రాజెక్టు మూడో దశ కింద దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ చెరువులోకి నీటిని ఎత్తిపోయడానికి అంతా సిద్ధం చేశారు. - 8లో▸



సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన - 8లో▸
సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు.

గరిష్టం/కనిష్టం
34°/24°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రిపూట కాస్త చలిగా ఉంటుంది.



న్యూస్‌రీల్

మద్యపాన ప్రియులతో సమాజ సేవ



ములుగు: ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యంతాగి వాహనాలు నడిపిన వారికి జిల్లా కోర్టు సివిల్ జడ్జి కన్నయ్యలాల్ వినూత్నంగా జరిమానా వేశారు. సుమారు నాలుగు గంటల పాటు సమాజ సేవ చేయాలని ఆదేశించారు. ఎస్సై వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ సర్వీస్‌లో ప్రోగ్రాంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలోఉన్న ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారం, పిచ్చి మొక్కల తొలగింపు పనులను చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు తాగి వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



టేకుమట్ల: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా అధికారి కళావతి అన్నారు. శనివారం మండలంలోని రామకిష్టాపూర్(టి) అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం సుకన్య సమృద్ధియోజన, బేటీ బచావో–బేటీ పడావో, మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖి కేంద్రాలను నిర్వహిస్తుందని అన్నారు. బాలికల చదువు అనంతరం వివాహానికి సుకన్య సమృద్ధి యోజన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. బాలికలే భవిష్యత్‌కు పునాదులుగా బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం కొనసాగిస్తున్నారని అన్నారు. బాలికలు సమాజంలో ఎక్కడైనా, ఎప్పుడైనా ఇబ్బందులకు గురయితే చైల్డ్ హెల్ప్‌లైన్ తోడ్పాటునందిస్తుందన్నారు. మహిళలు కుటుంబ పరంగా ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే సఖి కేంద్రం ద్వారా న్యాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. చైల్డ్ హెల్ప్‌లైన్, బాలికల సమస్యల కోసం 1098, వృద్ధుల సమస్యల కోసం 14567, మహిళల సమస్యల కోసం 181 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన, సఖి గాయత్రి మిషన్ శక్తి కో ఆర్డినేటర్ అనూష, మమత, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వనిత, నిర్మల, విమల పాల్గొన్నారు.

సోలార్‌తో రైతులకు ఆదాయం



భూపాలపల్లి రూరల్: సోలార్ ఏర్పాటు చేసుకోవడం వలన రైతులకు అదనంగా ఆదాయం సమకూరుతుందని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. పీఎం కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జ సురక్ష ఈవం ఉత్తన్ మహా అభియాన్) పథకం కింద కలెక్టరేట్‌లో శనివారం సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం కోసం దరఖాస్తు చేసుకున్న భూపాలపల్లి, ములుగు జిల్లా రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పథకం వివరాలు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో 115, ములుగు జిల్లాలో 49 దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఒక మెగావాట్ ప్లాంట్‌కు సంవత్సరంలో సుమారు రూ.57లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ములుగు అదనపు కలెక్టర్ సంపత్ రావు, భూపాలపల్లి ఎస్ఈ మల్సూర్ నాయక్, టీజీ రెడ్కో డీఎం హైదరాబాద్ పండారి, డివిజనల్ ఇంజనీర్ భూపాలపల్లి పాపిరెడ్డి, ములుగు డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ భూపాలపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

తిమ్మంపేటలో బోరుబావుల్లో నీటిమట్టం పడిపోవడంతో నీరందక ఎండిపోతున్న వరిపైరు



ఎండుతున్న వరి

అడుగంటిన భూగర్భ జలాలు

- వట్టిపోతున్న బోరుబావులు
- చివరి దశలో నీరందని పరిస్థితి
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

జిల్లాలో వరి సాగు వివరాలు	
మండలం	ఎకరాలు
మంగపేట	14,500
ఏటూరునాగారం	7,200
ఎస్ఎస్ తాడ్వాయి	3,358
వెంకటాపురం	3,000
వాజేడు	3,100
కన్నాయిగూడెం	850
గోవిందరావుపేట	8,200
ములుగు	7,987
వెంకటాపూర్	8,105

మంగపేట: జిల్లాలో రోజు రోజుకూ భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో వరి పంట సాగుచేసిన రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే వివిధ మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నెల రోజుల క్రితం వరకు రెండున్నర ఇంచుల పైపు నిండా నీటిని పోసిన బోరుబావులు ప్రస్తుతం పనిచేయని పరిస్థితి నెలకొంది. పలు మండలాల్లో కొన్ని బోరుబావులు అలా పోస్తు ఇలా ఆగిపోతున్నాయి. ప్రస్తుతం వరి బిర్రు పొట్ట, గింజ పోసుకునే దశలో ఉండగా పలు మండలాల్లో ముందుగా నాట్లు వేసిన చోట గింజ పోసుకునే దశలో ఉంది. మండుతున్న ఎండలతోపాటు వరి పంటకు ఎక్కువగా నీరు అవసరమైన సమయం ఇప్పుడే కావడంతో సరిపడా నీటిని అందించడం కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. సమయానికి నీరు అందకపోతే పొట్ట దశలో ఉన్న పైరు వడలిపోయే ప్రమాదం ఉండగా కంకి బయటకు వస్తున్న పైరు గింజ పోసుకోకపోవడంతో తాలుగా మారుతుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని మంగపేట మండలంలోని తిమ్మంపేటలో ఇప్పటికే బోరుబావుల్లో నీరు రాకపోవడంతో సుమారు 120 ఎకరాల మేర పైరు వడలిపోగా మరో 1,800 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దాదాపుగా జిల్లాలో ఇదే పపరిస్థితి నెలకొనడంతో రబీలో వరి పంట సాగుచేసిన రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. జిల్లాలోని 9 మండలాల్లో 56,300 ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు అధికారులు చెపుతుండగా.. అదనంగా మరో 10 వేల ఎకరాలకు పైచిలుగా సాగు చేసినట్లు అంచనా.

15 ఎకరాలు ఎండిపోతోంది



బోరు బావులు, చెరువు నీటిపై ఆధారపడి 18 ఎకారల్లో వరిపంట సాగు చేశా. ఎకరాకు పెట్టుబడి ఖర్చు రూ.40 వేల వరకు అయింది. కంకి దశలో ఉండగా బోరు బావుల్లో నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. రూ.70,000 ఖర్చు చేసి నూతనంగా బోరువేశా. నీరు పడలేదు. గింజపోసుకునే దశలో ఉన్న సుమారు 15 ఎకరాల పైరు పూర్తిగా ఎండిపోయింది.

– చిలకమర్రి భాస్కర్, రైతు, తిమ్మంపేట

ఆయకట్టు పంటలకు ఇబ్బంది లేదు



జిల్లాలో చెరువులు, ప్రాజెక్టుల కెనాల్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన వరి పంట ఏప్రిల్ మొదటి వారం వరకు కోత దశకు వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ఆయా పంటలకు అవసరమైన మేర సాగునీటికి ఢోకాలేదు. బోరుబావులపై ఆధారపడి సాగుచేసిన పంటలు ఎండిపోయిన విషయం మా దృష్టికి రాలేదు.

– సురేష్, జిల్లా వ్యవసాయాధికారి



వరిచేనులో నీరు లేక నెర్రబారిన నేల

భగీరథ ప్రయత్నం

భూగర్భ జలాలు అడుగంటిపోవడంతోపాటు మండుతున్న ఎండలకు పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. పంట ఎండితే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉండటంతో 500 మీటర్ల నుంచి కిలో మీటర్ల దూరం ఉన్నా సరే లెక్కచేయకుండా రైతులు ఆయిల్ ఇంజన్లు, జనరేటర్లు, మోటార్లను ఉపయోగించి చెరువులు, వాగుల్లో ఉన్న నీటిని తోడి పైపులు, ప్లాస్టిక్ ట్యూబులతో పంటలకు నీటిని మళ్లిస్తున్నారు. అరకొరగా నీటిని పోసే బోరు బావులు 24 గంటలు పనిచేసే విధంగా జనరేటర్ అమర్చుతున్నారు. అయినా పలు మండలాల్లో నీరు సరిపడకపోవడంతో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేసి బోరు బావులను ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నూతనంగా వేస్తున్న బోర్లలో నీరు పడకపోవడంతో చేతికొచ్చిన పంట కళ్లెదుటే ఎండిపోతుండడంతో తల్లడిల్లుతున్నారు.

రేంజ్ అధికారి బాలరాజు అరెస్ట్

తునికాకు కూలీల బోనస్ డబ్బుల స్వాహా

- రూ.2.70 లక్షల దుర్వినియోగం
- కేసు నుంచి బయటపడ్డ ఏడుగురు..
- 'సాక్షి'కి అభినందనలు

సాక్షి ఎఫెక్ట్

ఏటూరునాగారం: తునికాకు కూలీల బోనస్‌లో అవినీతి జరిగిందని అర్హులైన కూలీలు 2023 ఆగస్టులో సీసీఎఫ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. అయితే అటవీశాఖలో పనిచేసే ఒక కంప్యూటర్ ఆపరేటర్, మిగతా ఆరుగురు వాచర్స్ ఖాతాల్లో కూలీలకు చెందిన తునికాకు బోనస్ డబ్బులు పడినట్లు ప్రత్యేక టీం గుర్తించింది. వారి రిపోర్ట్ మేరకు ఇటీవల అటవీశాఖ రేంజ్ అధికారి అప్సరున్నీసా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న సీఐ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు విచారణను ముమ్మరం చేశారు. దీంతో కిషన్, వాచర్స్ వైకుంఠం, కన్నాయిగూడెంకు చెందిన మధుకర్, మహబూబ్, భిక్షపతి, నర్సింహులు, ప్రసాద్ అనే ఏడుగురి ఖాతాల్లో నగదు జమ అయినట్లు గుర్తించారు. ఈ క్రమంలో బాధితులు సాక్షిని సంప్రదించి జరిగిన విషయాన్ని వివరించారు. దీంతో సాక్షిలో 'అటవీశాఖ రేంజ్ అధికారి మోసం' అనే శీర్షికన ఈనెల 19న కథనం ప్రచురితమైంది. బాధితులకు జరిగిన నష్టాన్ని వివరించగా పోలీసులు కథనాన్ని పరిగణలోకి తీసుకున్నారు. మరుసటిరోజు బాధితులు.. బాలరాజు వద్దకు వెళ్లి డబ్బులు మీరే వేయించి మీరే డ్రా చేయించారని చెప్పగా నాకు ఎలాంటి సంబంధం లేదు.. అంటూ బుకాయించాడు. ఆధారాలున్నాయా.. అంటూ దిక్కరించారు. దీంతో 20వ తేదీన 'తునికాకు బోనస్‌లో చేతి వాటం' అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీంతో టాస్క్ ఫోర్స్, ఇంటలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగి లోతుగా విచారణ చేయగా రేంజ్ అధికారి బాలరాజు హస్తం ఉందని తేలింది. దీంతో బాధితుల నుంచి పోలీసులు వాంగ్మూలాన్ని సేకరించి శనివారం బాలరాజుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చారు. అసలు నిందితుడు దొరకడంతో ఈ ఏడుగురిపై కేసును తొలగించే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ ఘటనలో ఇంకెవరి ప్రమేయమైన ఉందా.. అనేది తెలియాల్సి ఉంది.


అటవీశాఖలో రేంజ్ అధికారి మోసం

ఈనెల 19న ప్రచురితమైన క్లిప్పింగ్


తునికాకు బోనస్‌లో చేతివాటం

20వ తేదీన ప్రచురితమైన క్లిప్పింగ్

పేదలకు అండగా నిలిచిన సాక్షి



మండల కేంద్రానికి చెందిన పలువురు అటవీశాఖలో పనిచేస్తున్నారు. వారిపై అక్రమ కేసు నమోదు చేయించి తప్పించుకోవాలని చూసిన అధికారి విషయాన్ని బట్టబయలు చేసిన సాక్షికి కృతజ్ఞతలు. పేదలను ఈ కేసు నుంచి తప్పించి ఆదుకోవాలి.

– ఇర్సవడ్ల సంతోష్, గ్రామస్తుడు, ఏటూరునాగారం

వ్యవసాయ యంత్రాల మంజూరు

ములుగు: వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా జిల్లాకు 16 బ్యాటరీ ఆఫ్ స్ప్రేయర్లు, 16 పవర్ స్ప్రేయర్లు, 8 రోటోవేటర్లు, ఏడు ట్రాక్టర్ డ్రాన్ ఇంప్రూవ్‌మెంట్స్, నాలుగు ట్రాక్టర్లు, రెండు సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్స్, రెండు బ్రష్ కట్టర్స్, డ్రోన్, పవర్ టిల్లర్, పవర్ వీడర్ కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రికరణ పరికరాలు మహిళా రైతులకు మాత్రమే 50 శాతం రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. మహిళా రైతులు గ్రామాల్లోని వ్యవసాయ విస్తీర్ణ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మానవాళి మనుగడకు నీరే ఆధారం

- జిల్లా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు

గోవిందరావుపేట: మానవళి మనుడగకు నీరే ఆధారమని జిల్లా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని చల్వాయి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో యువతరం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూగర్భ జలశాఖ ములుగు సహకారంతో పాఠశాల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూగర్భ జలాలను పొదుపు చేయలేకపోతే భవిష్యత్ తరాలకు ముప్పు తప్పదని అన్నారు. ఎంపీడీఓ జవహర్ రెడ్డి మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలు, నదులను సంరక్షించుకోవడం మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు వారి నిత్య జీవితంలో నీటి ప్రాముఖ్యతను గుర్తించి నీటి పొదుపును పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శరత్ బాబు, చల్వాయి గ్రామ కార్యదర్శి చుంచు భారతి, కేజీబీవీ ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి, యువతరం యూత్ అధ్యక్షుడు దశరథం, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చల్వాయిలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

- బుర్రి సతీష్ మాదిగ

గోవిందరావుపేట: మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ బిల్లు తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ అన్నారు. మండలంలోని పస్రా గ్రామంలో ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందడాన్ని స్వాగతిస్తూ ఎమ్మార్పీస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎంఎస్పీ ములుగు మండల అధ్యక్షుడు పసుల భద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందడం ద్వారా 70 ఏళ్ల మాదిగల కళ నేరవేరిందని తెలిపారు. న్యాయమైన లక్ష్యం కోసం పోరాటం చేస్తే ఏనాటికైనా విజయం వరిస్తుందని ఎమ్మార్పీస్ ఉద్యమం రుజువు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి, జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరాల బలరాం, ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు తోకల రాంబాబు, నాయకులు శ్రీనివాస్, దుర్గారావు, యాకోబ్, రమేష్, ఓదేలు, సాంబయ్య, ప్రవీణ్, మొగిళి, అనిల్, శేఖర్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికను స్వాగతిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు రూరల్ : దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఒకే దేశం ఒకే ఎన్నికను స్వాగతిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, రాష్ట్ర నాయకుడు పల్ల బుచ్చయ్య అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకే సారి ఎన్నికల జరగడం వల్ల ఆర్థికంగా, అభివృద్ధిపరంగా, ప్రజాధనం దుర్వినియోగం, ప్రలోభాలు లేకుండా ఎన్నికలు జరగడంతో సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు వీలుంటుందని అన్నారు. ఎన్నికల కోడ్ ఆంక్షలు లేకుండా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ అధికారులు పనులపై దృష్టి సారించి ప్రజా సమస్యల పరిష్కారానికి వీలుంటుందని అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికను స్వాతిస్తూ గ్రామాలు, మండలాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. పార్టీలకు అతీతంగా యువత, మేధావులు భాగస్వామ్యంతో ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రాచారి, ఇమ్మడి రాకేష్‌యాదవ్, కృష్ణాకర్‌రావు, నరేష్, రామరాజు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉంటాం

- ఎస్పీ శబరీశ్

వాజేడు: ప్రజల రక్షణ, భద్రత కోసం జిల్లా పోలీసులు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. మండల పరిధిలోని కోయవీరాపురం గ్రామాన్ని శనివారం ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ గ్రామస్తులతో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దని, వారు చేసే సంఘ విద్రోహ చర్యల్లో పాలుపంచుకోవద్దన్నారు. వారికి సహకరిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు, మావోయిస్టులు వస్తే తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని, చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని వివరించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెస్సేజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించి మోసపోవద్దని సూచించారు. బైక్ నడిపే సమయంలో హెల్మెట్, కారు నడిపితే సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని రహదారిని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి నిర్మించాలని కోరారు. తమ గ్రామంలో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల అభ్యర్థనకు స్పందించిన ఎస్పీ శబరీశ్.. కోయవీరాపురం గ్రామానికి కొత్తగా రహదారి వచ్చేలా చర్యలను తీసుకుంటామని, సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వాజేడు, వెంకటాపురం(కె) ఎస్సైలు రాజ్ కుమార్, తిరుపతిరావు, సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. వాజేడు పోలీసులు కొంగాల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. వాజేడు వైద్యాధికారి మధుకర్, ఏటూరునాగారం తేజా హాస్పిటల్ వైద్యుడు రవితేజ గ్రామంలోని రోగులను పరీక్షించి మందులను ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం ముఖ్య మన్నారు. అవి రెండు అందుబాటులో ఉంటే ప్రజలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తారన్నారు. మెడికల్ క్యాంపు అనంతరం ఎస్పీ శబరీశ్ దగ్గరకు వచ్చిన కొంగాల పాఠశాల ఉపాధ్యాయుడు కొంత మంది పిల్లలు ఎంత చెప్పినా బడికి రావడం లేదని ఆవేదనతో ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పిల్లలు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఆయన వెంట ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, వెంకటాపురం(కె) సీఐ కుమార్, ఎస్సైలు కృష్ణ ప్రసాద్, రాజ్ కుమార్, తిరుపతి రావు ఉన్నారు.



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శబరీశ్

మావోయిస్టు కదలికలపై దృష్టి సారించాలి

వెంకటాపురం(కె): జిల్లాలో మావోయిస్టు కదలికలపై అనునిత్యం దృష్టి సారించాలని, గ్రామాల్లో వారి రాకపోకలపై కన్నేసి ఉంచాలని ఎస్పీ శబరీశ్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రక్షణ కోసం స్టేషన్ నలుమూలల ఏర్పాటు చేసిన సీఆర్పీఎఫ్ గార్డులను తనికీ చేశారు. గార్డ్‌లో ఉన్న సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు సైతం అప్రమత్తంగా ఉండాలని, తమ సిబ్బంది గ్రామాలను సందర్శించినపుడు భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మావోయిస్టు కదలికలపై దృష్టిసారించాలని, వారు అమాయక ఆదివాసీ ప్రజలను ప్రభావితం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో కేసులలో అరెస్టు అయిన మావోయిస్టు పార్టీ సభ్యులు, సానుభూతిపరులను నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలని అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక క్వారీల్లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సైలు కొప్పుల తిరుపతిరావు, స్వామి ఉన్నారు.

ఐటీడీఏ కార్యాలయంలో నాగుపాము కలకలం



ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారం ఐటీడీఏ కార్యాలయంలో శనివారం నాగుపాము ప్రత్యక్షమైంది. క్యాంపు కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది కార్యాలయం లోపల నాగుపామును గుర్తించారు. వెంటనే స్థానికులకు సమాచారం అందించడంతో మేడారం సమీపంలోని కొత్తూరు వైన్ షాపులో పని చేస్తున్న నగేష్ కార్యాలయానికి వచ్చి ప్లాస్టిక్ డబ్బాలో నాగుపామును బంధించి అటవీ ప్రాంతంలో వదిలేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. నగేష్‌ను సమ్మక్క పూజారులు సిద్దబోయిన స్వామి, సిద్దబోయిన రమేష్, ఆదివాసీ విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, ఐటీడీఏ క్యాంపు కార్యాలయం సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ వెంకటేశ్



రామప్పలో విద్యార్థుల సందడి

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థుల సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శనివారం రామలింగేశ్వరున్ని త్రిశూలం, ఓంకారం ఆకారంతో ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ ప్రధాన ఆర్చకుడు కోమల్లపల్లి హరీష్‌శర్మ తెలిపారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ వెంకటేశ్ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు కట్టకు చేరుకొని సరస్సులో బోటింగ్ చేస్తూ కేరింతలు కొట్టారు.

ఇంటర్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ కె. ఇందుమతి శనివారం తెలిపారు. 2025లో పదో తరగతి పరీక్షలకు హాజరైన బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు http:tgrjc.gov.in దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 040- 24734899, 9866559727 నంబర్లను సంప్రదించాలని జిల్లా కో–ఆర్డినేటర్ ఇందుమతి సూచించారు.

4వ తేదీన గిరిజన భవన్‌లో జాబ్‌మేళా

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు హనుమకొండలోని గిరిజన భవన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఎఎన్‌ఎం, జీఎన్‌ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివిన, ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటా, విద్యార్హత జిరాక్స్ ప్రతులతో సకాలంలో జాబ్ మేళాకు హాజరు కావాలని పీఓ పేర్కొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 96/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 150/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 170/-
Cell: 9989299661

అరచేతిలో విద్యుత్ సేవలు



సాక్షి మీకోసం

యాప్ రూపొందించిన టీజీ ఎన్పీడీసీఎల్ | 20 ఫీచర్లతో అందుబాటులోకి..

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో టీజీ ఎన్పీడీసీఎల్ ఓ యాప్‌ను రూపొందించింది. సుమారు 20 ఆధునిక ఫీచర్లతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యాప్ ద్వారా ఇంట్లోనే ఉండి సమస్యలపై ఫిర్యాదు చేయడంతోపాటు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, నూతన సర్వీస్‌ల మంజూరు, పేరు మార్పు వంటి సేవలు పొందే అవకాశముంది.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా ఇందులో జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుడి ఫోన్ కెమెరా నుంచి ఆ ఘటన ఫొటో తీసి పంపవచ్చు. తద్వారా రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. దీంతో సమస్య త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

కన్స్యూమర్ గ్రీవెన్స్: వినియోగదారుడి సమస్యలు నేరుగా ఇందులో పొందుపరచవచ్చు. వినియోగదారుడి మీటర్ నంబర్, సమస్య వివరాలు ఇందులో నమోదు చేస్తే సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించి ఏ అంశమైనా ఫిర్యాదు చేసే సౌకర్యం ఈ యాప్‌లో అందుబాటులో ఉంది. ఫిర్యాదు స్టేటస్ చూసుకునే సౌలభ్యం ఉంది. సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందకపోతే పునరావృతం చేసుకునే వీలుంది.

సెల్ఫ్ రీడింగ్: ఈ యాప్ ద్వారా వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రతీ నెల నిర్ణీత తేదీన వారి విద్యుత్ బిల్లులను సెల్ఫ్ మీటర్ రీడింగ్ తీసుకోవచ్చు.

పే బిల్స్: నెలవారీ విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసుకొని చెల్లించవచ్చు. దీంతో సమయం ఆదా అవుతుంది. బిల్ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

బిల్ హిస్టరీ: వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లుల గత చరిత్ర ఇందులో చూసుకోవచ్చు. తద్వారా ప్రతీ నెలా బిల్లు ఎంత వస్తుంది పోల్చుకోవచ్చు. అలాగే విద్యుత్ వినియోగడం ఏ నెల ఎంత పెరిగిందో చూసుకుని పొదుపుగా వాడుకునే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ: ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లు వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకునే సౌకర్యముంది.

కొత్త సర్వీస్ స్థితి: కొత్త సర్వీసుల రిలీజ్ స్థితిగతులు ఎప్పటికప్పుడు అప్లికేషన్ నంబర్ ఎంటర్ చేసి తెలుసుకునే సౌకర్యం ఉంది. తద్వారా కొత్త సర్వీసుల మంజూరు వేగంగా జరుగుతుంది.

లింక్ ఆధార్– మొబైల్: వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్‌తో విద్యుత్ బిల్లుల సమాచారం ఫోన్‌కు చేరుతుంది. దీంతో గడువులోగా బిల్లులు చెల్లించవచ్చు

కొత్త కనెక్షన్, పేరుమార్పు: కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇందులో పొందుపరిచారు. దీంతోపాటు విద్యుత్ మీటర్ పేరు మార్పు, లోడ్‌కు సంబంధించిన వివరాలు ఇందులో ఉన్నాయి.

పవర్ కంజప్షన్ గైడ్ లైన్స్: విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

టారిఫ్ డీటెయిల్స్: విద్యుత్ వినియోగం చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో ఉంటాయి. గృహ, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు, ఇతర కేటగిరీల వారీగా చార్జీల వివరాలు ఇందులో పొందుపరిచారు.

ఎనర్జీ సేవింగ్, సేఫ్టీ టిప్స్: విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నపుడు పాటించాల్సిన పొదుపు సూచనలు, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇందులో వివరించారు.

ఫీడ్ బ్యాక్: వినియోగదారులకు అందిస్తున్న సేవలపై అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. ఇది చాలా ముఖ్యం. సలహాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొని మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది.

మై అకౌంట్: మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. వారి మీటర్ తాలూకు వివరాలు, తదితర సమాచారం ఉంటుంది.

వినియోగదారుల బిల్లు సమాచారం: దీనిలో వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.

అధికారి వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోచ్చు. వినియోగదారులకు ఎటువంటి సందేహాలున్న తమ పరిధిలోని అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు.

కాంటాక్ట్ అజ్: ఇందులో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు 1800 4250028, 1912 ఉంటాయి. వీటి ద్వారా సమస్యలు త్వరగా పరిష్కరించుకునే వెసులుబాటు ఉంది.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌పై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అరచేతిలోకి విద్యుత్ సేవలు తీసుకెళ్లడానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి యాప్‌ను ఆధునికీకరించి 20 రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

– మధుసూదన్‌రావు, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ, హనుమకొండ

యాప్‌తో అనేక ప్రయోజనాలు



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని సేవలు పొందొచ్చు. కార్యాలయాలకు రావాల్సిన సమయం, ఖర్చులు ఆదా అవుతాయి.

– గౌతం రెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్, ఎస్‌ఈ వరంగల్

చెరువులో చేపలు పడుతుండగా..

దొంగలుగా భావించి బిహార్ కూలీలను చెట్టుకు కట్టేసిన కాంట్రాక్టర్లు
- గోవర్ధనగిరిలో ఘటన

రఘునాథపల్లి: చెరువులో చేపలు పడుతున్న ఐదుగురిని దొంగలుగా భావించి చెట్టుకు కట్టేసిన ఘటన శనివారం మండలంలోని గోవర్ధనగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన కొందరు కూలీలు గ్రామశివారులోని ఆయిల్ కంపెనీలో పనులు చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో గ్రామ శివారులోని ఆనకుంటలో ఐదుగురు కూలీలు చెరువులో చేపలు పడుతున్నారు. కుంట చేపలను సంరక్షిస్తున్న కాంట్రాక్టర్లు వారిని దొంగలుగా భావించి తాడుతో చెట్టుకు కట్టేశారు. ఇటీవల వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు అపహరణకు గురవుతుండంతో వీరి పనేగా భావించి, చెట్టుకు కట్టేసిన ఫొటోలు గ్రామ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. అదే ఆయిల్ కంపెనీలో పని చేసే స్థానికులు వారిని గుర్తించి వారు బిహార్‌కు చెందిన కూలీలని, దొంగలు కాదని.. సరదాగా చేపలు పట్టేందుకు వచ్చారని వివరించడంతో వదిలేశారు.



చెట్టుకు కట్టేసి ఉన్న కూలీలు

సరదా.. విషాదమైంది

- ట్రాక్టర్ పైనుంచి జారిపడి బాలుడి మృతి
- పూమ్యాతండా సమీపంలో ఘటన



సాయికుమార్ మృతదేహం

గార్ల: సరదా.. విషాదమైంది. ట్రాక్టర్ పైనుంచి జారి టైర్ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం పూమ్యాతండా సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గార్ల గ్రామ పంచాయతీ పూమ్యాతండాకు చెందిన బానోత్ సాయికుమార్(15) సరదాగా ట్రాక్టర్‌పై మిరపతోట వెళ్లాడు. మిర్చిబస్తాలు లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్ పొలం గట్టు ఎక్కుతున్న క్రమంలో ఒక్కసారి కుదుపునకు గురైంది. దీంతో బాలుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కిందపడ్డాడు. వెనుక టైర్ బాలుడిపైనుంచి వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్ గార్లలో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా, సాయికుమార్ తండ్రి మంగీలాల్ 3 ఏళ్ల క్రితం ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి మృతిచెందాడు. సాయికుమార్‌కు తల్లి బుజ్జి, ముగ్గురు అక్కలు ఉన్నారు. కుటుంబంలో ఉన్న ఒక్కగానొక్క మగ దిక్కును కోల్పోయామని మృతుడి తల్లి, అక్కలు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు ఘటనా స్థలిని సందర్శించారు.

సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి
- ముగిసిన జాతీయ సదస్సు



పరిశోధన పత్రాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా సెనేట్‌హాల్‌లో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణ రాజకీయాలు, ప్రభుత్వాలు బహుళ వర్గాల ప్రజల ఐక్యతకు ప్రతీకయే గాకుండా ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తాయన్నారు.

సంకీర్ణ రాజకీయాలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

ప్రజాస్వామ్యం బలోపేతం, సంపదకేంద్రీకరణ సంకీర్ణ రాజకీయాలతోనే సాధ్యమని ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు కె. శ్రీనివాసులు అన్నారు. ఈ సదస్సులో ఆయన ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణం కేవల రాజకీయాలకు మాత్రమే కాదని ఆర్థిక సామాజికంలోనూ అవసరం అన్నారు. సంకీర్ణానికి భారతీయ జాతీయ ఉద్యమం గొప్ప ఉదాహరణ అన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకట్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడారు. ఆ విభాగం బీఓఎస్ చైర్మన్ గడ్డం కృష్ణయ్య, రిటైర్డ్ ఆచార్యులు రఘురాంరెడ్డి, జి వీరన్న,హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సదస్సులో 9 సెషన్లలో వంద మంది పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ పరిశోధన పత్రాలను పుస్తకం రూపంలోకి తీసుకురాగా వీసీ, రిజిస్ట్రార్ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఆవిష్కరించారు.

ఇక ఎత్తిపోసుడే..

- దేవాదుల–3 మోటార్లు ప్రారంభానికి అంతా సిద్ధం



పంప్‌హౌస్

హసన్‌పర్తి : దేవాదుల ప్రాజెక్టు మూడో దశ కింద దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ చెరువులోకి నీటిని ఎత్తిపోయడానికి అంతా సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం లేదా సాయంత్రం మంత్రి చేతుల మీదుగా మోటార్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి నీటిపారుదలశాఖ మంత్రా? ఇన్‌చార్జ్ మంత్రిని ఆహ్వానిస్తారా అనే విషయం అధికారులు స్పష్టంగా పేర్కొనడం లేదు. ఐదు రోజుల క్రితమే నీటిపారుదల శాఖ మంత్రి మోటార్లు ప్రారంభించడానికి వచ్చి కేవలం పూజలు చేశారు. ఆ రోజు అర్ధరాత్రి వరకూ మోటార్లు ప్రారంభించడానికి వేచి చూసి వెనుదిరిగారు. అప్పటికే పనులు పూర్తి కాకపోవడంతో ఆయన అధికారులపై సీరియస్సయ్యారు. ఇదిలా ఉండగా, పనులు పూర్తికి ఐదురోజుల సమయం పట్టింది. అధికారులు రాత్రింబవళ్లు పంప్‌హౌస్ వద్ద ఉంటూ పనులు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేశారు.

ప్రత్యేక నిపుణుల రాక..

దేవాదుల ప్రాజెక్టు–3 కింద ఏర్పాటు చేసే మోటార్లు ఆస్ట్రియాకు చెందిన అండ్రీజ్ కంపెనీవి. మోటార్లు ఆన్‌చేస్తే మళ్లీ ఏదైనా సాంకేతిక సమస్యలు ఏర్పడకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. ఆ దేశానికి చెందిన ప్రత్యేక నిపుణులతో ట్రయల్ కోసం దేవన్నపేటలోని పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. ట్రయల్ రన్ కోసం అంతా సిద్ధం చేశారు. ఆదివారం ట్రయల్ రన్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అధికారులు రెండు రోజులుగా డ్రై రన్ కొనసాగిస్తున్నారు.

నకిలీ పురుగు మందుల ముఠా అరెస్ట్

- రూ.78 లక్షల 63 వేల విలువైన మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



నిందితులతోపాటు నకిలీ పురుగు మందులను చూపుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: ప్రముఖ కంపెనీల పేర్లతోపాటు గడువు తీరిన పురుగు మందులను రైతులకు అంటగడుతున్న ముఠాలోని ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.78లక్షల 63 వేల విలువైన నకిలీ పురుగు మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీన చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్.. నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం వరంగల్ మట్టెవాడ బొడ్రాయి సమీపాన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు, వ్యవసాయధికారులు సంయుక్తంగా దాడి చేశారు. ఇందులో ముగ్గురు నిందితులు సిద్ధిక్, రాజేశ్, సదాశివుడుని అదుపులోకి తీసుకుని పెద్ద మొత్తంలో నకిలీ, గడువు తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మట్టెవాడ పీఎస్‌లో విచారించారు. ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేద ప్రకాశ్.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో స్థానిక వ్యాపారులు, పురుగు మందుల కంపెనీ ప్రతినిధి అయిన మరో నిందితుడు సిద్ధిక్ వద్ద కాలం తీరిన పురుగు మందులను కొనుగోలు చేసేవాడు. అలాగే, గడువు దాటిన పురుగు మందులతోపాటు, ఇద్దరు నిందితులైన ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్, ప్రస్తుతం జైలులో ఉన్న ఆదిత్య నుంచి ప్రముఖ పురుగు కంపెనీలైన ధనూక, టాటా, రైల్స్, బెయర్, ఆద్మాతోపాటు మరికొన్ని కంపెనీ పేర్లతో తయారు చేసిన నకిలీ పురుగు మందులు కొనుగోలు చేసేవాడు. ఈ విధంగా సేకరించిన గడువు తీరిన పురుగు మందులతోపాటు నకిలీ పురుగు మందులను ప్రభుత్వ అనుమతులు లేని మిగతా నిందితులకు విక్రయించాడు. ఈ నకిలీ పురుగు మందులను కొనుగోలు చేసిన నిందితులు.. వీటిని స్థానికంగా ఉన్న వ్యవసాయదారులకు విక్రయిస్తూ మోసగించేవారు. పోలీసులు అరెస్ట్ చేసిన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్‌తో పాటు సదాశివుడు, రాజు ఆదిత్య గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ప్రధాన నిందితుడి సమాచారం మేరకు ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్ గోదాములపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు దాడులు చేశారు. నిందితుల్లో విష్ణువర్ధన్ పరారీలో ఉన్నాడు. మరో వ్యక్తి ముద్దగుల ఆదిత్య హైదరాబాద్ జైలులో ఉండగా.. మిగతా ఏడుగురు మట్టెవాడకు చెందిన ఇరుకుల్ల వేదప్రకాశ్, లక్ష్మీపురానికి చెందిన మహ్మద్ సిద్ధిక్ అలీ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన నూక రాజేశ్ అలియాస్ రాజు, కరీంనగర్‌కు చెందిన యల్లం సదాశివుడు, ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన ఎండీ రఫీక్, ఏపీలోని ప్రకాశం జిల్లా మడుగుకు చెందిన ఆళ్ల చెరువు శేఖర్, దుగ్గొండికి చెందిన పాదిళ్ల సాంబయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్లు గోపి, రాజు, ఎస్సైలు వంశీకృష్ణ, నవీన్, ఆర్‌ఎస్సై భాను ప్రకాశ్, ఏఏఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సురేశ్, సురేందర్, సాంబరాజు, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటకు వెళ్లి.. ఉచ్చుకు తగిలి

- కరెంట్ షాక్‌కు గురై వ్యక్తికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ మృతి



గంగయ్య(ఫైల్)

ఏటూరునాగారం: అటవీ జంతువులను వేటాడటానికి వెళ్లిన ఓ వ్యక్తి.. కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొత్తగుడిసెల ప్రాంతానికి చెందిన తుమ్మ గంగయ్య(50), లొటపెటల నారాయణ, ఎద్దు లోకేశ్ కలిసి శుక్రవారం అర్ధరాత్రి చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లారు. ముగ్గురు కలిసి 33 కేవీ విద్యుత్‌లైన్‌కు కరెంట్ ఉచ్చులు తగిలించే ప్రయత్నం చేశారు. ఇందులో గంగయ్య కర్ర పట్టుకుని కరెంట్ వైర్లకు ఉచ్చుకు అమర్చిన వైర్ తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన లోకేశ్, నారాయణ భయభ్రాంతులకు గురై అక్కడి నుంచి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం ఉదయం ఘటనా స్థలికి చేరుకుని అతడిని రెండు కిలోమీటర్ల మోసుకుంటూ బయటకు తీసుకొచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఈ ఘటనలో లోకేశ్, లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కూతుళ్లు మౌనిక, అనిత ఉన్నారు.

సౌర ప్లాంట్‌తో రైతులు ఆర్థికంగా బలోపేతం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుతో రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) సంయుక్తంగా శనివారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల కార్యాలయంలో 'కుసుమ్' పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎండీ వరుణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. రైతులు సౌర శక్తిని ఉత్పత్తి చేసి మరింత ఆదాయం సమకూర్చుకోవడానికి ఇది సువర్ణ అవకాశమన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి చేసిన ప్రతీ యూనిట్‌కు రూ.3.13 ఇస్తామని, ప్రతీ నెల రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. రూ.2 కోట్ల వరకు ఆరు శాతం వడ్డీకి బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులు ఈ నెల 28 వరకు రూ.లక్ష పూచీకత్తు సొమ్ము డిపాజిట్ చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పూచీకత్తు సొమ్ము చెల్లిస్తామన్నారు. 25 ఏళ్ల అగ్రిమెంట్‌తో రైతులు లాభాలతో కూడిన నిలకడ ఆదాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు కె.వెంకటరమణ, రాజుచౌహాన్, జీఎం మల్లికార్జున్, టీజీ రెడ్కో డీజీఎం. వెంకటరమణ, డీఈలు అమర్‌నాథ్, సంపత్‌రెడ్డి, ఏఈ శ్రీపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలి

- ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయ భాను



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ డి.విజయ భాను, అధికారులు

హన్మకొండ: వేసవిలో ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను డిపో మేనేజర్లు, సిబ్బందికి సూచించారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలోని 9 డిపోల మేనేజర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ చాలెంజ్‌ను విజయవంతంగా నిర్వహించాలన్నారు. డీహైడ్రేషన్ నివారణకు రోజు తగిన మోతాదులో నీరు, మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకోవాలన్నారు. విధులు ముగిసిన తర్వాత తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఎలాంటి లీవ్‌లు, సిక్ లీవ్ తీసుకోని, గైర్హాజర్ కాకుండా డ్యూటీలకు హాజరైన వారికి ప్రోత్సాహాలు అందించనున్నట్లు చెప్పారు. మార్చి నుంచి జూన్ మాసాంతం వరకు మరింత శ్రద్ధతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ డిపోల ఆర్థికాభివృద్ధికి, తద్వారా రీజియన్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్ రావు, డిపోల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

తెలుగు పత్రికారంగంలో కొత్త పోకడలకు, సరికొత్త అంచనాలకు శ్రీకారం చుట్టిన 'సాక్షి' జాతీయ తెలుగు దినపత్రికలో ఈ క్రింది కేంద్రాలలో పనిచేయుటకు కంట్రిబ్యూటర్లు కావలెను. జర్నలిజం పట్ల ఆసక్తి, తెలుగులో సూటిగా సరళంగా రాయగల నేర్పున్న వారు కంట్రిబ్యూటర్లుగా చేరవచ్చును.

వరంగల్ ఉమ్మడి జిల్లాలో కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు

1) వరంగల్ రూరల్
2) కాశిబుగ్గ (వరంగల్)
3) కరీమాబాద్ (వరంగల్)
4) భీమదేవరపల్లి
5) పరకాల రూరల్
6) కోల్‌బెల్ట్ (జిఎస్ భూపాలపల్లి)
7) మహదేవపూర్
8) మహముత్తారం
9) జనగామ అర్బన్
10) ములుగు టౌన్
11) ఇనుగుర్తి (మహబూబాబాద్)
12) చెన్నారావుపేట

అర్హతలు
- కనీస విద్యార్హత డిగ్రీ
- వయస్సు: 18-35 సంవత్సరాలు
- స్థానిక సమస్యలపై అవగాహన
- కంప్యూటర్ పరిజ్ఞానం
- తెలుగు భాషపై ప్రావీణ్యం
- స్థానికులు, అనుభవం గల వారికి ప్రాధాన్యం

రాత పరీక్ష నిర్వహించే స్థలం :
ఆదర్శ లా కళాశాల, మొదటి అంతస్థు, హన్మకొండ బస్టాండ్ దగ్గర, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ పక్కన, హన్మకొండ.

పరీక్ష తేదీ : 23-03-2025 ఆదివారం ఉ॥ 11.00 గం॥లకు

SAKSHI MEDIA GROUP
సాక్షి
www.sakshi.com

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

NOW OR NEVER OFFER
FARM LAND ₹1400 per Sq.Yd.
50 Acres Mega Venture
*Free Gate & Fencing
Near JANAGAMA
Hyd-Warangal Highway
★ One Acre ★ Half Acre
OPERA PRIME PROJECTS
9515085557
7989626352

FLATS FOR SALE

■ HNK హంటర్ రోడ్ వరంగల్ పబ్లిక్ స్కూల్ అతి చేరువలో KBR రెసిడెన్సి నందు 3BHK (1445 sft) ఫర్నీష్డ్ Flats అమ్మబడును. Cont: 9177613161, 9866242881, 9603048033. [W-1264095]

పండ్లతోట అమ్మకము

■ తిరుపతి జిల్లా ఓజిలి మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు సంప్రదించండి : 94401 83778 [SCA25002282]

SERVICES

L.I.C. బాండ్ పోయినది

■ Immadi Amrutha, W/o. Late Kommalu, R/o. H.No.3-34, Eluguru Rangampet Village, Sangem Mandal, Warangal District గార్లది ఒరిజినల్ L.I.C బాండ్ నెం. 688815671 గలది నా భర్తది, నేను నామిని. ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలుపగలరు. 9110508106. [W-1265071]

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటివద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. 8977263124, 9100116067. [W-1264140]

లేడీస్ హాస్టల్ అమ్మబడును

■ భీమారం బస్టాప్ దగ్గరలో కరీంనగర్ మెయిన్ రోడ్‌లో గల 30 విద్యార్థినుల సెపరేట్ రూములతో రన్నింగ్‌లో ఉన్న గర్ల్స్ హాస్టల్ వెంటనే అమ్మబడును. సంప్ర॥ 9705864281 [WA-6570]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1265088]

BUSINESS OFFER

■ టెక్నికల్ అనాలిసిస్ చాలా సులభంగా ఇంట్రాడే, పొజిషనల్ స్టాక్స్ లో ఇన్వెస్ట్‌మెంట్. సంప్ర: 9885207852 [W-SCA25002300]

CHANGE OF NAME

■ I, MADHAVI, W/o. TERALA NAVEEN KUMAR, resident of 4-5-59/28A-4, Adharsha Nagar, Bhuvana Villa, Jangaon Town, Mandal: Jangaon, District: Jangaon, PIN Code: 506167, Telangana, hereby declare that I have changed my name from MADHAVI to MARYALA MADHAVI for all records. [SCA25002318]

WANTED

■ HNK యూనివర్సిటి క్రాస్‌లో గల ప్రముఖ డిగ్రీ ఫస్ సివిల్స్ అకాడమీ ఇండియన్ అకాడమీలో పనిచేయుటకు ఇద్దరు టెలికాలర్లు మరియు రిసెప్షనిస్టులు కావలెను. సంప్ర॥ 7674964050 [WA-14774]

■ Wanted Telecallers in Education Sector. Salary 10,000/- Full time & Part time 5,000/- Incentives are 10,000/- per Admission. Cont: 9908432153, 7288826032. [WA-6571]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [G-169]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ. అదనపు లైను 60/- రూ. మాత్రమే 5% GST అదనము

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు field staff కావలెను. (Broken rice procurement) వయసు 20-30 సం॥, బైక్ mandatory. Fresher / Experienced. Ph: 9133399257, 7075212345 [G-378]

■ సాయిరామ్ హోంకేర్ : Hydలో బేబి కేర్, పేషెంట్ కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు ఇంటిపని / వంటపనికి మనుషులు (ఆడ/మగ) కావలెను. జీ: 18 వేలు. 9949094607, 9908454607 [SCA25002181]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18k ఫోన్: 9640400073, 9160900024 [SCA25002324]

WANTED TEACHERS

■ Wanted Teachers for High School Section with B.Ed, & for Primary Section with Graduation, Send your Resume Whatsapp: 9949033066, 9989429744. [WA-485]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.